క్లుప్తంగా

రేపు పోస్టాఫీసులో ఆధార్ క్యాంపు

భట్టిప్రోలు: భారతీయ తపాలాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోస్టల్ వారోత్సవాలలో భాగంగా తెనాలి డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ కరుణాకర్ బాబు ఆదేశానుసారం భట్టిప్రోలు పోస్టాఫీస్‌లో ఈనెల 10న ఆధార్ క్యాంప్ నిర్వహిస్తున్నట్లు బ్రాంచ్ పోస్ట్ మాస్టర్ ఆర్.చంద్రశేఖర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నూతన ఆధార్ నమోదు ఉచితంగా చేయనున్నట్టు పేర్కొన్నారు. ఆధార్ సవరణలకు రూ. 50 నుంచి రూ. 100 వరకు రుసుము చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని భట్టిప్రోలు, పరిసర ప్రాంతాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపల్లె డీఎస్పీగా శ్రీనివాస రావు బాధ్యతల స్వీకరణ



రేపల్లె రూరల్: రేపల్లె డీఎస్పీగా ఎ.శ్రీనివాసరావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యసాయి జిల్లా ఉమెన్స్ పోలీసు విభాగంలో విధులు నిర్వర్తిస్తూ రేపల్లె డీఎస్పీగా విచ్చేశారు. రేపల్లె డీఎస్పీగా విధులు నిర్వర్తించిన తక్కెళ్లపాటి మురళీకృష్ణ తుళ్లూరుకు బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించటం జరుగుతుందన్నారు. శ్రీనివాసరావుకు కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ఆధార్ క్యాంపులను ఎస్టీలు సద్వినియోగం చేసుకోవాలి



రేపల్లె రూరల్: ఆధార్ కార్డు లేని ఎస్టీలకు గుర్తింపు కల్పించేందుకు ప్రత్యేక క్యాంప్‌లు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసరావు చెప్పారు. కలెక్టర్ ఆదేశాలతో మండలంలోని పెనుమూడి, చాట్రగడ్డ, విశ్వేశ్వరం, బొబ్బర్లంక, చోడాయపాలెం, కైతేపల్లి, రాజుకాల్వ, లంకెవానిదిబ్బ, నిర్మల్‌నగర్ గ్రామాలలో మంగళవారం నిర్వహించిన స్పెషల్ ఆధార్ క్యాంప్‌లో ఆయన మాట్లాడారు. కాల్వగట్లపై గుడిసెలు ఏర్పాటు చేసుకుని జీవించే ఎస్టీలకు గుర్తింపు కార్డులు లేనట్లు ఇటీవల సంఘస్తులు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. త్వరలో ఆయా గ్రామాలలో క్యాంప్‌లు నిర్వహించి ఆధార్‌కార్డులు నమోదు ప్రక్రియ చేపడతామని వెల్లడించారు. ఎస్టీలు క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలు పరిష్కరించాలి



రేపల్లె రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టిసారించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ అన్నారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో సీడీపీవో సుచిత్రకు అంగన్‌వాడీ కార్యకర్తలు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మణిలాల్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలపై పని భారం తగ్గించాలని, చాలా రకాల యాప్స్ పెట్టారని, అన్నీ కలిపి ఒకే యాప్‌గా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ, అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సెక్టార్ లీడర్లు కృష్ణకుమారి, కె.రత్నకుమారి, డి.జ్యోతి, బి.రజని, శివనాగులు తదితరులు పాల్గొన్నారు.

జంపనిలో కూలిన వృక్షం



జంపని(వేమూరు): జంపనిలో భారీ వృక్షం మంగళవారం మధ్యాహ్నం నేలకూలింది. భారీ వర్షం కురవడంతో ఈ చెట్టు రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికులు మూడు గంటలపాటు అవస్థలు పడ్డారు. అర్ అండ్ బీ అధికారులు యుద్ధప్రాతిపదికన వృక్షాన్ని తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

గుండెపోటుతో వీఆర్ఏ మృతి

తెనాలిరూరల్: కొల్లిపర మండలం దావులూరు గ్రామానికి చెందిన విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ కొల్లిపర ఏసుపాదం(57) మంగళవారం సాయంత్రం మందుల కోసమని తెనాలి వచ్చారు. ఇక్కడి పాత రత్నా టాకీస్ సెంటర్‌లో ఆటో దిగిన ఆయన రోడ్డుపై నడుచుకుంటూ వెళుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యాడు. అక్కడికక్కడే రోడ్డుపై కుప్పకూలి మృతి చెందాడు. అతడిని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కొద్ది సేపటికి మృతుడి కుమారులు ఘటనాస్థలానికి చేరుకున్నారు.

జోన్ల పద్ధతికి 'నీళ్లొదిలినట్టేనా'!

- శివారు కాలనీలకు అందని నీరు
- మున్సిపల్ అధికారుల ప్రణాళికా లోపం
- ప్రజల 'దాహా'కారాలు



ఓవర్‌హెడ్ ట్యాంకు నుంచి పైపులైన్ల ద్వారా నీటి విడుదలకు ఏర్పాటు చేసిన వాల్వ్

బాపట్ల: అన్ని ప్రాంతాలకు సజావుగా రక్షిత మంచినీరు సరఫరా అయ్యే పరిస్థితి బాపట్ల పట్టణంలో ఇప్పటిలో కనిపించడం లేదు. గతంలో ఇక్కడ అమలు చేసిన జోన్ల పద్ధతికి అధికారులు తిలోదకాలు ఇచ్చినట్టు కనిపిస్తోంది. ఫలితంగా శివారు ప్రాంతాలకు తాగునీరు సరిగా అందడం లేదు. ఆ ప్రాంతాల ప్రజలు దాహార్తితో అలమటిస్తున్నారు.

గతంలో జోన్ల పద్ధతిలో సరఫరా!

పట్టణంలో గతంలో ప్రాంతాలను బట్టి జోన్లుగా విభజించి ఒక జోన్‌కు ఉదయం, ఒక జోన్‌కు మధ్యాహ్నం, ఒక జోన్‌కు సాయంత్రం నీటిని విడుదల చేసేవారు. అప్పుడు అన్ని ప్రాంతాలకూ నీరందేది. కానీ ఇప్పుడు అందరికీ ఉదయం వేళ నీటిని సరఫరా చేస్తుండడంతో శివారు ప్రాంతాలకు నీరు సరిగా లాగడం లేదు. దీంతో ఆ ప్రాంతాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలో నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులకు కలిపి ఆరు జోన్లుగా విభజించి నీటిని సరఫరా చేస్తే అన్ని ప్రాంతాలకూ నీరందుతుందని మున్సిపల్ అధికారులే చెబుతున్నా.. ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. బాపట్ల పట్టణ విస్తీర్ణం 20.5 కిలోమీటర్లు ఉండగా 12,700 కుళాయిలు ఉన్నాయి. వీటిలో రెండు వేల కుళాయిలకుపై నీరు రాక నిరుపయోగంగా ఉన్నాయి. అన్ని ప్రాంతాలకు ఒక్కసారిగా నీరు వదలటంతో పైప్ లైన్ల చివరన ఉన్న ప్రాంతాలకు నీరు చేరేసరికే సరఫరా నిలిచిపోతోంది.

ఉప్పరపాలెం ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్వహణ అస్తవ్యస్తం

ఉప్పరపాలెంలో ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్వహణ లోపం వల్ల కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా సరిగా లేదు. ఫలితంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ట్యాంకును సరిగా నిర్వహిస్తే ఒకటి నుంచి నాలుగు వార్డులకు నీరు సమృద్ధిగా అందుతుంది. ఇదిలాఉంటే బాపట్ల పట్టణంలో ప్యాడిషన్‌పేట, బేతనీ కాలనీ, డ్రైవర్స్ కాలనీలో కూడా కొత్తగా ఓవర్‌హెడ్‌ట్యాంకుల నిర్మాణానికి ప్రతిపాదనలు పెట్టారు. పట్టణంలోని డ్రైవర్స్‌కాలనీ, శారదపురికాలనీ, దేవుడుచెరువు, మున్నంవారిపాలెం, శ్రీనివాసకాలనీ, ప్యాడిషన్‌పేట, యాదవపాలెంలో ప్రస్తుతం నీటి సరఫరా సరిగా జరగడం లేదు.

జోన్ల పద్ధతితో మేలు

జోన్ల పద్ధతితో మంచినీటి సరఫరా మెరుగుపడుతుంది. జోన్లు లేకపోవటం వల్ల పైపు లైన్ల మొదట్లో ఉన్న ప్రాంతాలకు ఎక్కువ నీరు లభిస్తోంది. శివారు ప్రాంతాలకు నీటి కష్టాలు ఎదురవుతున్నాయి.

– శ్రీనివాసరావు, మున్సిపల్ డీఈ

ఉపాధికి పీఎం విశ్వకర్మ పథకం దోహదం



పీఎం విశ్వకర్మ పథకం ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఎంపీపీ లలిత కుమారి

భట్టిప్రోలు: ఉపాధి మార్గాల సృష్టే ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం ప్రాథమిక లక్ష్యమని ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి పేర్కొన్నారు. భట్టిప్రోలులోని మండల పరిషత్ కార్యాలయంలో పీఎం విశ్వకర్మ పథకంలో భాగంగా శిక్షణ పొందిన ఏపీ వడ్రంగి అసోసియేషన్ వేమూరు నియోజకవర్గ కన్వీనర్ కోడూరు వెంకటేశ్వరరావు సంబంధిత ధ్రువపత్రాన్ని మంగళవారం ఎంపీపీ లలిత కుమారి చేతుల మీదుగా అందుకున్నారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ హస్తకళా నైపుణ్యాలు, సాధనాలను ఉపయోగించి వృత్తిని పటిష్ఠం చేసేందుకు ఈ పథకం దోహద పడుతుందన్నారు. ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 18 సంప్రదాయ వృత్తులలో ప్రత్యేకత కలిగిన కళాకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, ఏపీవో శివపార్వతి, ఏఎంజీ.శ్రీమన్నారాయణ, దావూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుని కుటుంబానికి ఆర్థిక సాయం



శేఖర్ కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

రేపల్లె రూరల్: రావిఅనంతవరం గ్రామానికి చెందిన విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుడు పిల్లి శేఖర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్, సీఐటీయూ నాయకులు మంగళవారం శేఖర్ కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.21,500 ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులు మృతి చెందితే వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రభుత్వం వీరిని అన్నివిధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో తెనాలి డివిజన్ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల అధ్యక్షుడు బొర్రా సురేష్, విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ సభ్యులు కె.అంబేద్కర్, గోవర్ధన్, నాగరాజు పాల్గొన్నారు.

11న మోదుకూరు జాతరపై ఫొటోగ్రఫీ పోటీలు

తెనాలి: చుండూరు మండలం మోదుకూరులోని ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మోదుకూరు గ్రామంలో ప్రసిద్ధి చెందిన దసరా ఉత్సవాల ఫొటోగ్రఫీ పోటీలను నిర్వహించనున్నారు. సంస్థ అధ్యక్షుడు తియ్యగూర సీతారామిరెడ్డి, వ్యవస్థాపకుడు కానాల సుధాకరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. మోదుకూరు శివారు కండేపాడులో 1928లో వెలసిన కనకదుర్గ అమ్మవారిని దుర్గాష్టమి రోజున అద్భుతమైన సంబరాలు జరగటం ఆనవాయితీగా గుర్తుచేశారు. ఈనెల 11వ తేదీన దసరాకు ముందురోజు మోదుకూరు జాతరలో తీసిన ఫొటోలతో ఈ పోటీని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఒక ఫొటోగ్రాఫర్ ఎన్ని ఫొటోలైనా పంపవచ్చనీ, సెల్‌ఫోన్ ఫొటోగ్రఫీ, ప్రొఫెషనల్ ఫొటోగ్రఫీలో పోటీలు ఉంటాయని, ప్రతి విభాగంలోనూ ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతోపాటు అయిదుగురికి ప్రశంసాపత్రాలను ఇస్తామన్నారు. జనవరి ఒకటిన మోదుకూరులో జరిగే వేమన జయంతి ఉత్సవాల్లో ఆ ఫొటోలను ప్రదర్శించి, విజేతలకు బహుమతులను ఇస్తామని వివరించారు. తీసిన ఫొటోలను ఫొటోజెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఫేస్‌బుక్ పేజీలో అప్‌లోడ్ చేయొచ్చనీ, లేదా phoŝorfenicartrcirce@fmai.comకు ఈమెయిల్‌కు పంపాలనీ, తుదిగడువు నవంబరు 10గా తెలిపారు. 9491336258, 98480 92182 నంబర్లను సంప్రదించాలని కోరారు.



రేపల్లెలో ధనలక్ష్మీదేవిగా వాసవీమాత



రేపల్లెలో లలితా త్రిపుర సుందరి అలంకారం



పేటేరులో మహాలక్ష్మి అలంకారం



కావూరులో ప్రత్యేక అలంకారంలో అమ్మవారు



రాజవోలులో ప్రత్యేక అలంకారం



రేపల్లెలో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



రేపల్లె ఇసుకపల్లిలో మంగళగౌరిగా దర్శనమిస్తున్న భ్రమరాంబ అమ్మవారు

అమృతవర్షిణీ.. అపు'రూపిణీ'

దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆరో రోజు అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులను కటాక్షించారు. వరాల సిరులు కురిపించే ధనలక్ష్మిగా కొన్నిచోట్ల భక్తులను కరుణించారు. వివిధ అలంకరణల్లో మెరిశారు. భక్తులు అమ్మవార్ల దివ్యమంగళ స్వరూపాన్ని కనులారా తిలకించి పులకించారు. అమృతవర్షిణీ.. అపురూపిణీ నమోస్తుతే అంటూ ప్రణమిల్లారు.

– వేమూరు/రేపల్లె రూరల్/చెరుకుపల్లి/భట్టిప్రోలు



భట్టిప్రోలులో సాయిబాబాకు గంధాభిషేకం



గుళ్ళపల్లి గ్రామంలో అమ్మవారు



చినపరిమిలో ధనలక్ష్మిగా అమ్మవారు



ధనలక్ష్మి దేవి అలంకారంలో వాసవీమాత



భట్టిప్రోలులో సంతానలక్ష్మి దేవి అలంకారం



వెల్లటూరులో లక్ష్మిదేవి అలంకారంలో కట్లమ్మ

చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు

భట్టిప్రోలు: చట్టాలపై మహిళలకు అవగాహన అవసరమని సీనియర్ సివిల్ జడ్జి, రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ టి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. భట్టిప్రోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం సీనియర్ అడ్వకేట్ కొండపల్లి శ్రీనివాసరావు (రేపల్లె) అధ్యక్షతన జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహిళల రక్షణకు రాజ్యాంగం ప్రత్యేక చట్టాలను రూపొందించిందన్నారు. రాజ్యాంగం అందరికీ సమాన హక్కులు కల్పించిందన్నారు. చిన్నచిన్న వివాదాలను పెద్దవి చేసుకోవద్దని గ్రామీణులకు హితవు పలికారు. సదస్సులో రిసోర్స్ పర్సన్ ఎస్‌బీపీ ఝాన్సీ(సీనియర్ అడ్వకేట్-గుంటూరు), షేక్ అమీనా రెహమానా (అడ్వకేట్)లు ఉచిత న్యాయ సహాయం, గృహహింస చట్టం, మెయింటెనెన్స్, న్యాయ సేవా సంస్థ అందించే సేవలతో పాటు చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సీహెచ్ జలజ, వేమూరు సీఐ వీరాంజనేయులు, భట్టిప్రోలు ఇన్‌ఛార్జ్ ఎస్ఐ రవికృష్ణ, కొల్లూరు ఎస్ఐ ఏడుకొండలు, వీఆర్వోలు శివరామకృష్ణ, ప్రసాద్, పంచాయతీ, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సయ్యద్ అక్తర్‌హుస్సేన్



ఇంటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం



పెనుమర్రు గ్రామంలో పొలం పిలుస్తోంది పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

కర్లపాలెం: ఖరీఫ్ సాగులో యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా తక్కువ ఖర్చుతో నాణ్యమైన దిగుబడులు పండించవచ్చునని రైతు శిక్షణ కేంద్రం ఏడీఏ సయ్యద్ అక్తర్ హుస్సేన్ చెప్పారు. మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం గణపవరం, చింతాయపాలెం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాలను ఏడీఏ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వరి పైరుకు వ్యవసాయాధికారులు సూచించిన మోతాదు మేరకే ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని చెప్పారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన అధిక దిగుబడులు పండించేందుకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలని రైతులకు అవగాహన కల్పించారు. ఏవో సుమంత్‌కుమార్ మాట్లాడుతూ సాగు చేస్తున్న రైతులందరూ తప్పనిసరిగా పంట నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈవో భాగ్యలక్ష్మి, వ్యవసాయ సహాయకులు వేదశ్రీ, ధృవకుమార్, రైతులు పాల్గొన్నారు.

నల్లి తెగులు నివారణకు చర్యలు తీసుకోవాలి

అమర్తలూరు(వేమూరు)/రేపల్లె రూరల్: వరిలో నల్లితెగులు ఎక్కువగా కనిపిస్తోందని, రైతులు నివారణ చర్యలు చేపట్టాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి ఎ.లక్ష్మి చెప్పారు. అమర్తలూరు మండలంలోని ఇంటూరు గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నల్లి తెగులు నివారణ మార్గాలను వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఇందిర, మండల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

- వేమూరు మండలంలోని పెనుమర్రు, కోడిపర్రు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి చందోలు సునీత మాట్లాడుతూ రైతులకు పలు సూచనలు వివరించారు. కార్యక్రమంలో వీఆర్వో జితేంద్ర, పంచాయతీ కార్యదర్శి సింధూ రైతులు పాల్గొన్నారు.
- మండలంలోని పెనుమూడి గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి ఆర్.విజయ్‌బాబు గ్రామంలోని పొలాలను సందర్శించి సాగులో చేపట్టాల్సిన వివిధ అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫిషరీస్ అసిస్టెంట్ కె.అనిల్‌కుమార్, వెటర్నరీ అసిస్టెంట్ వంశీ, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ నవీన్, అభ్యుదయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

హిందూసనాతన ధర్మంలో

మౌలికమైన ప్రమాణం వేదం

వేద మహాసభలో పండితులు



వేదపారాయణం చేస్తున్న పండితులు

తెనాలి: హిందూ సనాతనధర్మంలో అత్యంత మౌలికమైన ప్రమాణం వేదమని భగవంతుని ద్వారా వేదం పుట్టిందని పలువురు వేదపండితులు పేర్కొన్నారు. వేదిక బ్రాహ్మణ సేవాసమాఖ్య, తెనాలి ఆధ్వర్యంలో స్థానిక నాజరుపేటలోని విద్యాశంకర భారతి నరసింహ సదనంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం వేద మహాసభ నిర్వహించారు సమాఖ్య ప్రధాన కార్యదర్శి తాడేపల్లి సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన వహించా రు. వేద పండితులు విష్ణుభట్ల ఆంజనేయ చైను లు ఘనపాటి, విష్ణుభట్ల శ్రీకృష్ణ ఘనపాటి, విష్ణుభట్ల సత్యనారాయణ ఘనపాటి, విష్ణుభట్ల లక్ష్మీపతి ఘనాపాటి తమ ప్రసంగాల్లో వేదం విశిష్టతను వివరించారు. విశ్వవ్యాపితమైన విషయాలు నిధిగా సృష్టికి కారణభూతమైనదిగా వేదం వెలుగొందుతోందని చెప్పారు. ఋషులు భగవంతుని ద్వారా వేదాన్ని విని లోకానికి దానిని గానం చేస్తూ అందించారని తెలిపారు. బుద్ధి సూక్ష్మతను పెంచుకోవడానికి వేదాలు ఎంతగానో దోహదపడతాయనీ, వేద సభలతో లోకానికి హితం కలుగుతుందని అన్నారు. సమాఖ్య కార్యవర్గసభ్యులు ముందుగా గణపతి ప్రార్థన చేసి గాయత్రీ దేవికి విశేష పూజలు చేశారు. కంచి పరమాచార్య స్వామీజీ, విద్యాశంకర భారతీయ నరసింహా స్వామీజీ ఆశీస్సులు కోరుతూ ప్రార్థన చేశారు. సుదూర ప్రాంతాల నుంచి విచ్చేసిన 58 మంది వేద పండితులు వేద పారాయణ చేశారు. సమాఖ్య గౌరవాధ్యక్షుడు భాగవతుల కామేశ్వరరావు, కోశాధికారి తురుమెళ్ల దక్షిణామూర్తి ఉపాధ్యక్షులు కేవీ సుబ్రహ్మణ్యం, మేడూరి శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి రావినూతల రాజేంద్రప్రసాద్, మేళ్లచెరువు అనిల్ కుమార్, పింగళి వేణుధర్, కార్యవర్గ సభ్యులు నారాయణం వేణుగోపాల్, సీఎంకే తిరుమలరావు, పుల్లే సూర్యప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు

13న మారథాన్‌లో పాల్గొనండి

తెనాలిఅర్బన్: తపాలాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13న గుంటూరులో ఇండియా పోస్టు రన్ పేరిట 10కె, 5కె, 3కె రన్‌లను నిర్వహించనున్నట్లు తెనా లి పోస్టల్ సూపరింటెండెంట్ కరుణా కరబాబు తెలిపారు. రన్‌కు స్పాన్సర్స్‌గా ఉన్న తెనాలి డబల్ హార్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్, కుమార్‌పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యంలను మంగళవారం వారి కార్యాలయంలో పోస్టల్ ఉద్యోగులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే 1000 మంది రన్‌లో పాల్గొనేందుకు తమ పేర్లు రిజిష్టర్ చేయించుకున్నట్లు తెలిపారు. గెలుపొందిన వారి కి మెడల్స్ అందజేయనున్నట్లు చెప్పారు. ముఖ్య అతిథులుగా కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, పోస్టల్ ఉన్నతాధికారులు పాల్గొంటారని వివరించారు. అనంతరం మెడల్స్‌ను తెనాలి డబల్‌హార్స్ గ్రూప్ ఆఫ్ కంపెనీ అధినేత మునగాల శ్యామ్‌ప్రసాద్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో చీఫ్ ఆపరేషన్ ఆఫీసర్ పుట్ట శేఖర్, విజయవాడ చీఫ్ పోస్ట్‌మాస్టర్ కార్యాలయ అధికారి సు . దీర్‌బాబు, గుంటూరు పోస్టల్ సూపరింటెండెంట్ యు.యలమందయ్య పాల్గొన్నారు.

- వైఖానస ఆగమ అర్చనా విధానంపై ఆన్‌లైన్ కార్యశాల

తెనాలి: వైఖానసాగము అర్చనా విధానంపై తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా తొమ్మిదిరోజుల కార్యశాల జరుగుతుందని ఆగమ విభాగం అధ్యక్షుడు ప్రొఫెసర్ వేదాంతం విష్ణుభట్టాచార్యులు తెలి పారు. ఈనెల 16న కార్యశాల మొదలై 24వరకు ఉంటుందన్నారు.